# సురాజ్యం

## ఉద్యమ పత్రిక

1

2012 ఆగస్టు








### సుపరిపాలనకోసం... అందరికీ ఎదిగే అవకాశాల కోసం....

# సురాజ్య ఉద్యమ నగార మోగింది

పాలకుల కాళ్లుమొక్కే స్థితి నుంచి బైటపడి ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడి తలెత్తుకుని బతికే సుపరిపాలనకు, మంచి రాజకీయానికి కావలసిన వ్యవస్థల్ని నిర్మించేందుకు ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం, లోక్‌సత్తా ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా ఆగస్టు 9, 2012న 'సురాజ్య' ఉద్యమ నగారా మోగింది. "ప్రభుత్వ సేవలను పౌరులకు ఒక హక్కుగా అందించటం, రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ బలమైన అవినీతి నిరోధక వ్యవస్థల్ని ఏర్పాటు చేయటం, స్థానిక ప్రభుత్వాల సాధికారతతో జనంచేతికి అధికారాన్నివ్వటం, సమర్థులైన నిజాయతీపరులు రాజకీయాలలోకి వచ్చేలా మౌలికమైన ఎన్నికల, రాజకీయ సంస్కరణలు తేవటం కోసం పటిష్ఠ సంస్థాగత ఏర్పాట్లు చేయటం" అనే నాలుగు నిర్దిష్ట అంశాల ఎజెండాతో ఓ చారిత్రక అవసరంగా క్విట్‌ఇండియా డే న మొదలైన సురాజ్య ఉద్యమం తొలిదశ అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం డిసెంబర్ 9వరకూ జరుగుతుంది. ఉద్యమ ప్రారంభం రోజు ఆగస్టు 9 ఉదయం 10గంటలకు లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో హైదరాబాద్ ఫ్యాప్సీహాల్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో న్యాయ, రాజ్యాంగ కోవిదులు, అవినీతి నిరోధక సంస్థలు, ఉద్యమసంస్థలు, మీడియాలోని విశేష అనుభవజ్ఞులు, పౌరప్రముఖులతోపాటు సీపీఎం, సీపీఐ, బీజేపీ, తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్రసమితి (టీఆర్ఎస్), వైకాపా తదితర పార్టీల నేతలు కూడా ప్రారంభ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. అదేరోజు సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కిక్కిరిసిన జనసందోహం మధ్య జరిగిన సురాజ్య బహిరంగసభలో ప్రముఖ సినీదర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి, ఎమ్మెల్సీ డా॥ కె. నాగేశ్వర్, పాత్రికేయ ప్రముఖులు కె. రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు – సెప్టెంబర్ నెలలో సన్నాహక సమావేశాలు, కార్యక్రమాలతో ప్రతిసంస్థనూ, పౌరసమాజాన్ని భాగస్వాముల్ని చేసి, ఆ తర్వాత అక్టోబర్ 2 నుంచి అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం డిసెంబర్ 9లోపు కోటిమంది ప్రజలను చేరాలని లక్ష్యంగా తొలిదశ సురాజ్యఉద్యమం సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో మొదలుపెట్టి కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీలో కూడా సురాజ్య ఉద్యమాన్ని విస్తరించనున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా సురాజ్య ఉద్యమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి, ప్రతి గుండెనూ తట్టి, ప్రతి భారతీయుడినీ, ముఖ్యంగా యువతని ఇందులో భాగస్వాముల్ని చేసి, ప్రజల డిమాండ్‌గా మార్చి, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలున్న భారతదేశాన్ని నిర్మించటమే ఈ ఉద్యమ కార్యాచరణ.

**ఆగస్టు 9,2012న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎంతో ఉత్తేజభరితంగా జరిగిన సురాజ్య బహిరంగసభ విశేషాలు ముందుగా....**

## సురాజ్యానికి సమయం వచ్చింది : జేపీ

ఒక ఉద్యమనిర్మాతకి ఆ ఉద్యమంపై అందరూ మాట్లాడాక ప్రత్యేకించి చెప్పేందుకు ఏమీ మిగలకపోతే, ఆ భావజాలం అద్భుతంగా సమాజంలోకి వెళ్లినట్టని, అలాంటి అరుదైన సందర్భంలో కలిగే అనిర్వచనీయమైన ఆనందం తనకిప్పుడు కలుగుతోందని అంటూ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తన సురాజ్య ప్రసంగాన్ని ప్రారంభించారు. పేరు తనకు రాకపోయినా దేశం కోసం లోక్‌సత్తా అనేక చిరస్మరణీయ ఫలితాలను సాధించిందన్నారు. అవినీతిపరులు దిగ్భ్రాంతికర స్థాయి విజయాలు సాధిస్తూ వ్యవస్థలో నిరాశను నింపుతున్న ఈ తరుణంలో ఆ నిరాశానిస్పృహల్ని పారదోలటానికి తాము సాధించిన కొన్ని విజయాలనైనా గుర్తుచేసుకోవటం, ప్రజలకు తెలియచెప్పటం లోక్‌సత్తా కార్యకర్తలకు అవసరమన్నారు.

1998లో పెట్రోల్ తూనికలలో అవకతవకల్ని సరిచేసేందుకు లోక్‌సత్తా అవగాహనతో, చిత్తశుద్ధితో చేసిన ఒక చిన్నప్రయత్నం వల్ల దేశవ్యాప్తంగా 85శాతం తూనికల అవకతవకలు సరయ్యాయన్నారు. దీనివల్ల ఈ పదిహేనేళ్లలో ప్రజలకు సుమారు రూ.2లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూరిందన్నారు. అలాగే ఓటర్ల జాబితా ప్రక్షాళన, నిజాయతీ రాజకీయాలకు ఇచ్చే విరాళాలకు పన్ను మినహాయింపు, పార్టీ ఫిరాయింపుల కట్టడి చట్టం, సమాచార హక్కు చట్టం, స్థానిక న్యాయాలయాల చట్టం, జాతీయ ఆరోగ్య మిషన్, సహకార సంస్థల బలోపేత చట్టం, మంత్రివర్గసభ్యుల సంఖ్యను పరిమితం చేసేందుకు 91వ రాజ్యాంగసవరణ వంటివి లోక్‌సత్తా కృషితోనే జరిగాయన్నారు. అధికారాలను వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు ఇవ్వాలని 1కోటీ 8లక్షల మందితో లోక్‌సత్తా చేసిన సంతకాల సేకరణ దేశచరిత్రలోనే అపూర్వమన్నారు. విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత వంటి మౌలిక అంశాలు కేవలం లోక్‌సత్తా వల్లే రాజకీయ ఎజెండాగా మారాయన్నారు. ప్రభుత్వ సేవలను పౌరులకు ఒక హక్కుగా అందించేందుకు, న్యాయవ్యవస్థను సురక్షితం చేసేందుకు లోక్‌సత్తా చేస్తున్న నిరంతర కృషి త్వరలో చట్టాలరూపంలో రాబోతోందన్నారు. స్థానిక సంస్థలకు తమ ఇష్టమొచ్చినట్టుకాకుండా రాష్ట్రాలు విధిగా అధికారాల్ని, నిధుల్ని కేటాయించేలా రాజ్యాంగసవరణ చేయటం కోసం చేస్తున్న ప్రయత్నం ఒక కొలిక్కివస్తోందన్నారు.

ఇలా పైకి ప్రస్ఫుటంగా కనిపించేలా లోక్‌సత్తా సాధించిన కొన్ని విజయాలను వివరించిన అనంతరం, తాజాగా చేపడుతున్న సురాజ్య ఉద్యమ ఎజెండాను జేపీ స్థూలంగా వివరించారు.

ఈవేళ మనదేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో వస్తున్న అవరోధాలపై నిరాశ అక్కర్లేదని, సంకల్పం ఉంటే అవినీతిని



నిర్మూలించవచ్చుని, అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి ఇవ్వవచ్చుని, పౌరసేవల్ని ఒక హక్కుగా అందించవచ్చుని, ఎన్నికల, రాజకీయ సంస్కరణల్ని తీసుకురావచ్చుని... ఈ నాలుగింటినీ ఖచ్చితంగా సాధించుకునే సమయం ఆసన్నమైందని అన్నారు. వీటిని సాధించాక ఇక ఉద్యమాల పర్వాన్ని ఆపి నిఘాపర్వం మొదలుపెడతామన్నారు. అసలు వ్యవస్థలే సక్రమంగా లేకుండా నిఘా పెట్టటం వల్ల ఫలితముండదన్నారు.

మహాకవి గురజాడ అప్పారావు 1890లలో తాను రాసిన కన్యాశుల్కంలో బండినడిపే వ్యక్తి చేత చెప్పించిన మాటల్ని జేపీ ఈ సందర్భంగా ఉటంకిస్తూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇక్కడున్న మన హెడ్‌కానిస్టేబుల్‌కి ట్రాన్స్‌ఫర్ అవుతుందా? అని బండినడిపే వ్యక్తి అంటాడని, ఆ వ్యక్తి ప్రశ్నకి సమాధానమే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయ్యాక లోక్‌సత్తా చేపడుతున్న సురాజ్య ఉద్యమమని పేర్కొన్నారు. సురాజ్యం లేకపోతే స్వరాజ్యం స్వాహారాజ్యం అయితీరుతుందన్నారు. అవినీతి+సంక్షేమం= అధికారం అనే గొప్ప ఈక్వేషన్‌ని ఇటీవల మనరాష్ట్రంలో తయారుచేసి పెద్దవిజయం సాధించటం చూస్తున్నామన్నారు. మనరాష్ట్రంలో మొదలైన ఈ ఫార్ములాని ఇప్పుడు దేశవ్యాప్తంగా అనుకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కీలకతరుణంలో కాళ్లుమొక్కే స్థాయి నుంచి తమ కాళ్ల మీద నిలబడి బతికే స్థాయికొచ్చేలా ప్రజల ఆకాంక్షల్ని ఎలా పెంచాలి? వారిని ఆత్మన్యూనత నుంచి ఎలా బైటపడేయాలి? అనేదే కీలకమన్నారు. ప్రజల ఆకాంక్షల్ని పెంచేందుకే, వారి ఆకాంక్షల్ని నెరవేర్చేలా వ్యవస్థల్ని నిర్మించేందుకే సురాజ్య ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. కులం, మతం, భాష, ప్రాంతం తదితర ఎటువంటి వివక్షలూ లేకుండా తలెత్తుకుని బతకటం నా జన్మహక్కు అని ప్రతి పౌరుడూ ధీమాగా భావించాలన్నారు.

రాజకీయాలలో వున్నవారంతా చెడ్డవాళ్లని, బైటవున్నవాళ్లంతా గొప్పవాళ్లని ముద్రవేయటం సరికాదన్నారు. ఈ ధోరణి వల్ల మన స్వోత్కర్ష పెరగటం తప్ప దేశానికి ప్రయోజనం ఉండదని జేపీ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడే సుపరిపాలనకు కావలసిన వ్యవస్థీకృత ఏర్పాట్లకు తగిన ప్రయత్నం చేయకుండా, ఉన్నవ్యవస్థ నుంచే మార్పు దానంతటది వస్తుందనే భావనతో నిర్మాణం చేశారన్నారు. ఓటు అంటే ఏమిటో తెలియకపోవటం వల్ల ఎమ్మెల్యే, ఎంపీలకు ఓట్లు వేశాం కాబట్టి వీధి దీపం వెలగకపోవటం, తాగునీరు రాకపోవటం దగ్గర్నుంచి ప్రతి పనికీ వారే బాధ్యులనే ధోరణి పెరిగిందన్నారు. స్థానికంగా జరగాల్సిన పనులు ఇక్కడే ఎందుకు జరగటంలేదు, పైస్థాయి వరకూ ఎందుకు వెళ్లాల్సి వస్తోందనే ఆలోచన లేకుండాపోయిందన్నారు. తమ కుటుంబాన్ని, సొంతపనుల్ని పట్టించుకునే అవకాశం కూడా లేకుండా పడుతున్న ఈ ఒత్తిడి వల్ల నిజాయతీపరులు రాజకీయాల నుంచి పారిపోయారని, మిగిలినవారు అవినీతికి పాల్పడటం మొదలుపెట్టారని అన్నారు. నిజాయతీగా ఉండే అవకాశం రాజకీయాలలో లేకుండా చేసి రాజకీయాలలో వున్నవారిని నిందిస్తూ ఒడ్డునుంచి గడ్డలు వేయటం వల్ల ఫలితం లేదన్నారు.

1950లలోనే ఓటు కొనేందుకు, ఓటర్లను పోలింగ్‌బూత్‌కి రప్పించేందుకు డబ్బులు, ప్రలోభాలు ఇచ్చారని జేపీ గుర్తుచేశారు. ఆంధ్రరాష్ట్రంలో



అవినీతి రాజకీయాలు మొదలయ్యాయని 1948, జనవరి 11,12 తేదీలలో ప్రార్థనా సమావేశాల సమయంలో స్వయంగా గాంధీ తనకు కొండా వెంకటప్పయ్య పంతులు వంటి వ్యక్తుల నుంచి వచ్చిన లేఖలను చూపించి చెప్పారని అన్నారు. అవినీతిని సర్వసాధారణమన్నట్టు చేసి, దాని మీద ప్రజలు తిరగబడకుండా తమకు ఓటుబ్యాంకులుగా కొనసాగించేందుకు వీలుగా వారిని బిచ్చగాళ్లుగా చేసే ఎజెండాను సాంప్రదాయ పార్టీలు అమలు చేస్తూవస్తున్నాయన్నారు. మారాజు తింటే తిన్నాడు మాకు నెలకింతని పింఛను, వడ్డీ, రుణాలు మాఫీ చేస్తున్నాడు అని ప్రజలు ఒంగి సలాములు చేసే పరిస్థితి కల్పించారన్నారు.అదీ చాలకపోతే కులం, మతం, ప్రాంతం, భాష,వర్గం పేరుతో ప్రజల్ని చీలుస్తున్నారన్నారు. డబ్బు, తాయిలాలు, విభజన ఈ మూడూ దేశరాజకీయాలను శాసిస్తూ ప్రజల్ని బిచ్చగాళ్లలా, స్వరాజ్యంలోనే ద్వితీయశ్రేణి పౌరులుగా, పరాయివారుగా తయారుచేశాయన్నారు. ఈ పరిస్థితి మారి ప్రజలు తలెత్తుకు బతకటం అవసరమని, అది పూర్తిగా సాధ్యమని, అందుకోసం ముందుగా వాస్తవాల్ని, పరిష్కారాల్ని అర్థం చేసుకోవాలని అన్నారు. అంత సుదీర్ఘకాలం నుంచి వున్న అవినీతిని నిరోధించి అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించేందుకు కనీసం ఇప్పటికైనా నిర్దిష్టమైన ఏర్పాట్లు అవసరమన్నారు.

తమ ఊరిలో, పట్టణంలో, వార్డులో ఉన్న వనరుల్ని మన అభివృద్ధికోసం, మన బిడ్డల భవిష్యత్తు కోసం ఖర్చుచేసేందుకు ప్రజలు పాలనలో భాగస్వాములవ్వాలని జేపీ పిలుపునిచ్చారు. ఇప్పటివరకూ పాలకులు ఏది చివర రావాలో ఆ పథకాల్ని మొదట అమలుచేస్తున్నారని, ఏది మొదటచేయాలో అది చివర చేస్తున్నారని అన్నారు. దీనివల్ల నేతలకి, వారి కుటుంబాలకు తరతరాలకు సరిపడా సంపద లభిస్తుండగా, ప్రజలు శాశ్వత బీదలుగా కొనసాగుతున్నారన్నారు. దీన్ని పూర్తిగా మార్చి అధికారాన్ని జనం చేతికి తీసుకెళ్లటానికి, అవినీతిని అంతం చేయటానికి, ప్రజలకు రోజువారీ సేవలు వెంటనే ఎక్కడికక్కడ అందించటానికి, రాజకీయాలలోకి సమర్థులు, నిజాయతీపరులు వచ్చి నెగ్గేందుకు వీలుగా ఎన్నికల సంస్కరణలు తేవటానికి సురాజ్య ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. దామాషా ఎన్నికల పద్ధతి అన్నిదేశాలలో అవసరం లేకపోయినా, భారతీయ పరిస్థితులకు మాత్రం మేలుచేస్తుందన్నారు.

సురాజ్య ఉద్యమం ప్రతిపాదించిన ఈ నాలుగు మార్పులకీ సరైన సమయం ఇప్పుడు వచ్చిందని, ఒక పదునైన భావానికి సమయం వచ్చినప్పుడు మోహరించిన సైనికశ్రేణులు కూడా ఆపలేవని జేపీ ఉద్ఘాటించారు. సురాజ్య ఉద్యమం ఒక రాజ్యాంగలక్ష్యమని, పార్టీలకతీతంగా అందరూ కలిసిరావాలన్నారు. ప్రతి గడపనూ, ప్రతి తలుపునూ తడదాం. ప్రతి గుండెఘోషనూ విందాం. అందరిలో ఆలోచనను పెంచి వారి జీవితాలలో మార్పు కోసం చేస్తున్న సురాజ్య పోరాటంలో భాగస్వాముల్ని చేద్దాం అని పిలుపునిచ్చారు. సురాజ్య ఉద్యమం ఒక



చారిత్రక అవసరమని, ఇది ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే పరిమితంకాదని, ఇక్కడ్నుంచి కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీలో కూడా అక్కడి పరిస్థితులకనుగుణంగా చేపడతామని, ముఖ్యంగా యువతని ఇందులో భాగస్వాముల్ని చేస్తామని జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.

### సురాజ్యపై మీ మెదళ్లకు పోటీ

### సినీదర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి

నా భారతదేశం నెంబర్‌వన్‌గా ఉండాలి, అలా మనదేశం నెంబర్‌వన్ కావటానికి ఏం చేయాలో తెలిసిన వ్యక్తి డా॥ జేపీ... ఇవి రెండే తనకు తెలిసిన విషయాలని ప్రముఖ సినీదర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి అన్నారు. పూర్వం దొంగతనం, అవినీతి చేస్తే సిగ్గుపడేవారని, ఇప్పుడు బరితెగించి తిరుగుతున్నారని అన్నారు. "చిన్న అవినీతికి పాల్పడ్డవారిని మాత్రమే దొంగలుగా, పెద్దఅవినీతికి పాల్పడినవారిని హీరోలుగా భావించే ధోరణి సమాజంలో పెరుగుతుంటే భయమేస్తోంది. కానీ నేను ఆశావాదిని. అవినీతిపై తిరగబడేవారు కూడా చాలామందే ఉండబట్టే అన్నా హజారే ఉద్యమం విజయవంతమైంది. అలాగే సురాజ్య ఉద్యమం కూడా విజయవంతమవుతుందని ఆశిస్తున్నా. సినిమా కథలు, స్క్రిప్టులు, పాటలు వంటివి చూడమని చాలామంది నా వద్దకు వస్తుంటారు. కానీ నాకు సమయం లభించదు. సురాజ్య ఉద్యమ నేపథ్యంలో అటువంటి ఔత్సాహికులకు మంచి అవకాశం లభిస్తోంది. షార్ట్‌ఫిల్మ్‌లు, యాడ్ ఫిల్మ్‌లు, స్కిట్‌లు, నాటికలు, పాటలు, వ్యాసరచన, నినాదాలు, ఎస్.ఎం.ఎస్ మెస్సేజ్‌లు, కార్టూన్లు, జోక్‌లు ఇలా 11 అంశాలలో పోటీలు జరుగుతాయి. మీ సృజనాత్మకతనంతా జోడించి తయారుచేయండి. అయితే అవి సురాజ్య సబ్జెక్ట్ మీదే అయ్యుండాలి. వాటిని నేనే స్వయంగా చూస్తాను. తగిన బహుమతులు, ప్రోత్సాహకాలు కూడా అందిస్తాం. క్రియేటివ్ శక్తి కలిగినవారు ఈరకంగా సురాజ్య ఉద్యమంలో భాగస్వాములు కండి. మీ రచనల్ని పంపేందుకు, ఇతర వివరాలకు 'సురాజ్యం.డాట్‌ఇన్' వెబ్‌సైట్‌ను చూడండి" అని విజ్ఞప్తి చేశారు.

### సురాజ్యంపై ప్రతి ఇంట్లో చర్చ : కె.రామచంద్రమూర్తి

ప్రముఖ జర్నలిస్ట్ హెచ్‌ఎంటీవీ, ది హన్స్ ఇండియా చీఫ్‌ఎడిటర్ కె. రామచంద్రమూర్తి మాట్లాడుతూ... అవినీతి, అసమర్థ పాలన పట్ల ప్రజలలో తీవ్ర ఆగ్రహావేశాలు నెలకొన్నాయని, వాటిని ఉద్యమరూపంలోకి మలచటమే ఈవేళ మనముందున్న సవాలని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా నాయకత్వం వహించగల విలక్షణత, విలువలు, ప్రామాణికత గల నేత డా॥ జేపీ ఒక్కరేనన్నారు. అవినీతి అనేది ఎన్నికలలో ఒక అంశమే కాదు అని చర్చలలో మేధావులు, మీడియా విశ్లేషకులు భావించటాన్ని తాను అంగీకరించనన్నారు. దేశాన్ని కొల్లగొడుతుంటే అది కాకుండా మరేది ఇష్యూ అవుతుంది అని ప్రశ్నించారు. అన్నా హజారాలాంటి వ్యక్తి కూడా రాజకీయాలను బాగు చేయటానికి రాజకీయాలే మార్గమని భావిస్తున్నారని, అయితే డబ్బు, మద్యం, ప్రలోభాలు, కులం,మతం, ప్రాంతం, వర్గం వంటి ప్రభావాల మధ్య అన్నా హజారే బృందం ఎలా గెలుస్తుంది అని ఆలోచించే స్థాయిలోనే మన సమాజం ఉందని అన్నారు.

ఈ వ్యవస్థను మార్చే పరిష్కారాల మీద ప్రతి ఇంట్లో చర్చ జరగాలని, ప్రతి కుటుంబం నుంచి సురాజ్య ఉద్యమం మొదలవ్వాలని కోరారు.

### ప్రత్యామ్నాయం కోసం ప్రజలు అన్వేషణ

### ఎమ్మెల్సీ డా॥ నాగేశ్వర్

రాజకీయ, పాలనారంగాలలో సంస్కరణల కోసం చేస్తున్న సురాజ్య ఉద్యమం తక్షణావసరమన్నారు. ఎమ్మెల్సీ కుమార్తెగా చెప్పుకోవటానికి తన బిడ్డ కూడా నామోషీగా ఫీలవుతోందని, రాజకీయాల్ని ఇంత చిన్నచూపు చూస్తున్న కాలమిది అని ఎమ్మెల్సీ డా॥ కె. నాగేశ్వర్ అన్నారు. అయితే ప్రజలంతా అలాగే ఉన్నారని, అవినీతిని పట్టించుకోవటంలేదని అనుకోవాల్సిన పన్లేదని, మార్పు కోసం, ప్రత్యామ్నాయం కోసం అన్వేషణ చేస్తున్నారని అన్నారు. ఆ అన్వేషణను ఆతృతగా మార్చటానికి సరైన నాయకత్వం మార్గదర్శకత్వం అవసరమన్నారు. రైల్వే టికెట్ల రిజర్వేషన్‌లో, టెలిఫోన్‌ల మంజూరులో ఒకప్పుడున్న అవినీతి ఈవేళ మటుమాయమైనట్టే అన్నిచోట్లా అవినీతిని అంతం చేయవచ్చనే విశ్వాసం ప్రజలలో కలిగిస్తే అవినీతికి వారు పాతరేస్తారన్నారు.

ముఖ్యంగా యువతలో ఈ విశ్వాసం, ప్రేరణ కావాలన్నారు. మనదేశంలో ఒక సామాన్యుడు, బక్కపల్చని వ్యక్తి పోలీసుల వద్దకు వెళ్లేందుకు భయపడతాడని, నక్సలైట్ల వద్దకు వెళ్లేందుకు మొగ్గుచూపుతాడని... అదే బాగా డబ్బున్న వ్యక్తి నక్సలైట్ల వద్దకు వెళ్లేందుకు భయపడతాడని, పోలీసుల వద్దకు వెంటనే వెళ్లగలుగుతాడని, మనం ఎలాంటి వ్యవస్థను నిర్మిస్తున్నామో ఒక్కసారి లోతుగా సమీక్షించుకోవాలని అన్నారు.

## ఎన్నికలే లేని స్థానిక ప్రభుత్వాలు

### సోలిపేట రామచంద్రారెడ్డి

స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం పోరాడుతున్న ఉద్యమకారుడు సోలిపేట రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... సరైన సమయంలో, సరైన ఎజెండాతో లోక్‌సత్తా సురాజ్య ఉద్యమాన్ని మొదలుపెట్టిందన్నారు. గ్రామాలకు 29 అధికారాలను, పట్టణాలకు 18 అధికారాలను వెంటనే బదిలీచేయించి స్థానిక ప్రభుత్వాలకు అధికారాల్ని, నిధుల్ని ఇచ్చేలా ఈ ఉద్యమం ద్వారా ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్రానికి ఐదేళ్ల పాటు గవర్నర్ పాలన విధిస్తే ఎమ్మెల్యేలు ఊరుకుంటారా? మరి రాష్ట్రంలాగే సొంతపాలన కలిగిన గ్రామాలు, పట్టణాలలో ఎన్నికలను ఏళ్ల తరబడి ఎందుకు జరపటం లేదు అని ప్రశ్నించారు. సమస్యలకు మూలాల్ని, పరిష్కారాల్ని గ్రహించి ప్రజలు ఈ ఉద్యమం ద్వారా కదలాలన్నారు.

## సురాజ్య ఉద్యమం ఇప్పుడెంతో అవసరం

### తెలకపల్లి రవి

గనులు, స్పెక్ట్రమ్ తదితర ప్రకృతివనరులు కొందరు వ్యక్తులకు గుత్తాధిపత్యంగా కట్టబెటట్టం, చంచల్‌గూడ జైలు అధికార కేంద్రంగా మారటం వంటి పరిణామాల నేపథ్యంలో, స్వతంత్రం కుతంత్రంగా మారి, స్వరాజ్యం 'సురా'రాజ్యంగా, 'అసుర'రాజ్యంగా మారిన ప్రస్తుత తరుణంలో సురాజ్య ఉద్యమం ఎంతో అవసరమని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, వామపక్షవాది తెలకపల్లి రవి అన్నారు.

## విశాల ప్రాతిపదికన సురాజ్య ఉద్యమం

### డి.వి.వి.యస్. వర్మ

ప్రజలందరి డిమాండ్‌గా మారాలి: లోక్‌సత్తా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వి.వి.ఎస్ వర్మ క్విట్‌ఇండియా డే ఆగస్టు 9న ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన సురాజ్య ఉద్యమం తొలిదశగా అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం డిసెంబర్ 9 వరకూ జరుగుతుందని, ఈ నాలుగు నెలలపాటు రాష్ట్రవ్యాప్తంగా సురాజ్య ఉద్యమ నినాదం, లక్ష్యాలు మారుమోగాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్రకార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వం మనం చేసిన డిమాండ్లన్నిటినీ నెరవేరుస్తుందని ఆశించవద్దని, చేస్తే కొన్ని చేస్తుంది కాబట్టి మళ్లీ ఉద్యమాన్ని కొనసాగించాల్సిందేనని తెలిపారు.

ఇదో దీర్ఘకాలిక ఉద్యమం. పార్టీలకతీతంగా సాగే ఉద్యమం. పార్టీలకు ఎన్నికలలో విధానాలపరమైన కొట్లాట ఉండవచ్చు. కానీ



భారతదేశానికి కావలసిన వ్యవస్థలను ఇప్పటికైనా ఏర్పాటు చేయటంపై ఎవరికీ అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు ఉండే అవకాశం లేదు. అందువల్ల విశాల ప్రాతిపదికన, అందరినీ కలుపుకుంటూ సాగేది సురాజ్య ఉద్యమం. సంకుచిత రాజకీయాలకు ఇందులో తావులేదు.

సురాజ్య ఒక సానుకూల ఉద్యమం. అవినీతి అంతం ఒక్కటే చాలదు. మనం అవినీతిరహిత పాలనతోపాటు అందరికీ ఎదిగే అవకాశాలున్న వ్యవస్థ నిర్మాణం చేసుకోవాలి. దేశంలో పరిపాలన ఉందిగానీ సుపరిపాలన లేదు. రాష్ట్రంలో అసలు పరిపాలనే లేదు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో మన లక్ష్యం ఇంకా పెద్దది. లక్షల కోట్లు సామాన్యుడి సంక్షేమం పేరుతో పట్టణాలలో, గ్రామాలలో ఖర్చు చేస్తున్నా, పేదరికం పోవటంలా. రైతులకపేరుతో రకరకాల సబ్సిడీలు ఇస్తున్నా రైతులకు ప్రయోజనం చేకూరటంలా. రుణాల ఊబిలో కూరుకు పోతున్నారు. యువతకు చదువు లేదు, కాస్తోకూస్తో చదువు ఉన్నవారికి మంచి ఉపాధి పొందేందుకు నైపుణ్యాలు లేవు. మనకు డబ్బులు, వనరులు, అవకాశాలకు కొదవలేదు. మనదేశంలో ఉన్నన్ని అవకాశాలు ప్రపంచంలో దాదాపు ఏ దేశంలోనూ లేవు. పాలనా దారిద్ర్యం వల్లే మనల్ని పేదరికం, అరకొర జీవితాలు వెంటాడుతున్నాయి. పాలన చేతగాని దారిద్ర్యం మన దేశాన్ని భ్రష్టుపట్టిస్తోంది. మంచి పాలనను తెచ్చుకోవాలంటే అందుకోసం రాజకీయాల్ని కూడా బాగుచేసుకోవాలి. మంచి రాజకీయాన్ని బతికించుకోవాలి. వాస్తవానికి రాజకీయం చేయాల్సిన పని ప్రతి వ్యక్తీ తన కాళ్ల మీద తాను తలెత్తుకుని నిలబడి బతికే అవకాశాల్ని నిర్మించటం. కానీ ఆ పని చేయకుండా ప్రస్తుత పాలనావ్యవస్థ కేవలం రాయితీలు ఇవ్వటాన్నే రాజకీయంగా చూపిస్తోంది. ఈ రాయితీలు ఇవ్వటం కోసమే అన్ని సాంప్రదాయ పార్టీలూ పోటీపడుతున్నాయి. రాయితీల బతుకులీడుస్తున్న ప్రజలు రాజాలా బతికేందుకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయటం.

సురాజ్యానికి మార్గాలు, అందుకు ఎలాంటి వ్యవస్థల్ని ఎలా ఏర్పాటు చేయాలి అనేది ఈ ఉద్యమం ప్రజలలోకి తీసుకెళ్తుంది. సురాజ్యం మన జన్మహక్కుగా ప్రజలు పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది" అని డి.వి.విఎస్ వర్మ వివరించారు.

## సురాజ్య ఉద్యమానికి మద్దతివ్వాలి

## సత్యవాణి, భారతీయం సంస్థ

భారతదేశం ఎదుర్కొంటున్న నివారించదగ్గ సమస్యలను, సంక్షోభాలను చూసి ఒక సగటు భారతీయురాలిగా, గృహిణిగా కన్నీరు కారుస్తున్న తాను... ఆధునిక వివేకానందుడు, ఆధునిక గీతాచార్యుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన పిలుపుకి స్పందించి సురాజ్య ఉద్యమంలోకి వచ్చానని భారతీయం సంస్థ ప్రతినిధి సత్యవాణి తెలిపారు. లోకశ్రేయస్సు కోసం జరుగుతున్న ఈ కృషిలో అన్ని పార్టీలూ, అన్నివర్గాల ప్రజలూ పాల్గొని తమవంతు తోడ్పాటును అందించాలని కోరారు.

## విద్యార్థులు, యువతలో మార్పు కోసం తపన

## పద్మ భూపతిరాజు

విదేశాలలో లోక్‌సత్తా భావజాల ప్రచార రాజకీయసంస్థ 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' (పీఎఫ్ఎల్)కు భారతదేశంలో సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పద్మ భూపతిరాజు మాట్లాడుతూ... ఇప్పుడున్న వ్యవస్థ వల్లే మనమెంతో నష్టపోతున్నాం, ఈ వ్యవస్థను మార్చాలి అనే తపన అనేక కళాశాలల్లోని విద్యార్థులలో, యువతలో తాను స్వయంగా చూశానని, అమెరికా సహా అనేకదేశాలలోని భారతీయులలో కూడా ఇదే భావన బలంగా ఉందని, అందుకే పీఎఫ్ఎల్‌ను ప్రారంభించామని తెలిపారు. సురాజ్య ఉద్యమానికి ప్రవాసభారతీయులు కూడా పెద్దఎత్తున మద్దతు పలుకుతున్నారని, యువతను ఇందులో క్రియాశీలకంగా భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## జనానికి వారి సత్తా చాటి చెప్పాలి

## లోక్‌సత్తా సమన్వయకర్త టి.ఎల్ నరసింహారావు

సురాజ్య సభకు అధ్యక్షత వహించిన లోక్‌సత్తా ఉద్యమసంస్థ రాష్ట్ర సమన్వయకర్త టి.ఎల్ నరసింహారావు మాట్లాడుతూ... "1997 నుంచి లోక్‌సత్తా చేస్తున్న ఉద్యమాలకు కొనసాగింపుగా జరుగుతున్న సురాజ్య ఉద్యమం ఈవేళ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ప్రారంభమైంది. ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన కనిపిస్తోంది. పూటకోమాట, మనిషికో మాట, ప్రాంతానికో మాట చెప్పే వ్యక్తి కాదు డా॥ జయప్రకాష్ నారాయణ్. నిజాయతీగా, నిబద్ధతతో ఆలోచించే, మాట్లాడే, పనిచేసే వ్యక్తి ఆయన. జేపీ ప్రారంభించిన అన్ని ఉద్యమాలలాగే ఈ సురాజ్య ఉద్యమం కూడా గొప్పవిజయం సాధిస్తుందనటంలో సందేహం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలు తమ సత్తా తెలుసుకుని తలెత్తుకుని బతికేందుకు ఈ ఉద్యమం ద్వారా ఒక శాశ్వత మార్గం ఏర్పడుతుంది" అన్నారు. ■

### రాజకీయ పార్టీలు, ఉద్యమసంస్థలు, న్యాయకోవిదులు, మీడియా, పురప్రముఖులతో

# హైదరాబాద్‌లో సురాజ్యం రౌండ్‌టేబుల్




***సురాజ్య బహిరంగసభకు ముందు ఆగస్టు 9 ఉదయం ఫ్యాప్సీహాల్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతోపాటు, రాజ్యాంగ, న్యాయరంగాలలో, అవినీతి నిరోధక సంస్థలలో, ఉద్యమసంస్థలలో, మీడియాలో విశేషానుభవం కలిగి ప్రభావం చూపిన ప్రముఖులు హాజరయ్యారు. సురాజ్య ఉద్యమ ఎజెండాకు తమ మద్దతు తెలుపుతూ తమ అనుభవం నుంచి కొన్ని సలహాసూచనల్ని అందించారు. క్షేత్రస్థాయిలో కూడా తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ అభిప్రాయాలన్నిటినీ క్రోడీకరించి ఉద్యమ ఎజెండాలో భాగంగా వినియోగించుకుంటామని, ఉద్యమానికి ఎప్పటికప్పుడు సలహాలివ్వటానికి ఒక కమిటీని ఏర్పాటు చేసే ప్రయత్నం కూడా జరుగుతోందని రౌండ్‌టేబుల్ సమావేశానికి సమన్వయకర్తగా వ్యవహరించిన డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.***

### సురాజ్య ఎజెండాగా 4 నిర్దిష్ట అంశాలు

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

సురాజ్యఉద్యమం పక్షపాత రాజకీయాలకు అతీతంగా చేపట్టిన ఉద్యమమని, ఇందులో రాజకీయ విధానపరమైన అంశాలు ఉండవని, మన ప్రజాస్వామ్య వికాసానికి కావలసిన వ్యవస్థల నిర్మాణం మాత్రమే ఉంటుందని జేపీ ప్రకటించారు. అందువల్లే అన్ని పార్టీలనూ, సమాజంలోని కీలకరంగాలలో విశేషానుభవం కలిగినవారిని ఇందులోకి ఆహ్వానించామన్నారు. భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యలు అందరికీ తెలుసుకాబట్టి, సమస్యల వర్ణన కాకుండా వాటి పరిష్కారానికి దారితీసే వ్యవస్థల ఏర్పాటుకే చర్చను పరిమితం చేయాలని కోరారు. 2011, ఏప్రిల్ 24న న్యూఢిల్లీలో లోక్‌పాల్ బిల్లుపై లోక్‌సత్తా ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం వల్ల లోక్‌పాల్‌పై దేశవ్యాప్తంగా స్థూల ఏకాభిప్రాయం సాధ్యమైందని గుర్తుచేశారు. అనంతరం సురాజ్య ఉద్యమ నేపథ్యాన్ని జేపీ వివరిస్తూ... మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్ని లోపాలున్నా, కొరతలున్నా దాన్ని పరిరక్షించుకోగలుగుతున్నామని, అయితే ఇప్పటికీ ఆ లోపాలను సరిచేసుకోకపోతే స్వరాజ్యం కాస్తా స్వాహారాజ్యంగా మిగిలిపోతుందని అన్నారు. అధికారాన్ని విపరీతంగా కేంద్రీకరించి రాజధానులకే పరిమితం చేశారని, గ్రామాలలో, పట్టణాలలో, వార్డులలో అధికారం లేకుండా చేశారని, ఎంత ప్రయత్నించినా ప్రజలకు తమ సమస్యలు తీరే మార్గం దొరకని పరిస్థితి కల్పించారని అన్నారు. దీనివల్ల ఓటు అడిగినవారిని నిరంతరం సతాయిస్తూ వారి మీద ప్రజలు విపరీతభారం పెడుతున్నారని, ఎమ్మెల్యే, ఎంపీగా ఎన్నికవటమంటే వ్యక్తిగత జీవితాల్ని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనికితోడు ఓటు కోసం డబ్బు వెదజల్లాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితులలో రాజకీయాలలో నిజాయతీ అసాధ్యంగా మారి, 90శాతంమందికి అవినీతి సాధారణ కార్యక్రమంగా మారిపోయిందన్నారు. ఈ పరిస్థితి మారాలనే కోర్కె అందరిలో ఉన్నా, అందుకు సరైన వ్యవస్థలు లేకుండా అది సాధ్యం కాదని, అందుకే లోక్‌సత్తా సురాజ్య ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. ఆ ఉద్యమంలో భాగంగా నాలుగు నిర్దిష్ట అంశాలను ఎజెండాగా ప్రజల ముందుకు తీసుకొస్తోందన్నారు.

"1) అధికారాన్ని జనం చేతికి ఇవ్వటం. ఇందుకోసం స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని విధిగా ఇచ్చేలా చట్టబద్ధ ఏర్పాటు చేయటం. జిల్లాప్రభుత్వాల నిర్మాణం జరగాలి.

2) పౌరులకు రోజువారీ కావలసిన సేవల్ని దయాభిక్షలాగా కాకుండా ఒక హక్కుగా ఇవ్వటం. నిర్ణీత కాలపరిమితికి ఆలస్యమైతే ప్రభుత్వం పరిహారం చెల్లించటం. ఇందుకోసం సిటిజన్ ఛార్టర్స్ వంటివి అమలు చేసేలా రైట్ టూ సర్వీసెస్ చట్టాన్ని తేవాలి.

3) రాష్ట్రాన్ని కబళిస్తున్న అవినీతిని నిరోధించటానికి జాతీయస్థాయిలో బలమైన లోక్‌పాల్ తరహాలో రాష్ట్రంలో బలమైన లోకాయుక్త, అదే తరహాలో గ్రామస్థాయి వరకూ అవినీతి నిరోధక వ్యవస్థల ఏర్పాటు జరగాలి.

4) స్వతంత్రం వచ్చి 65 ఏళ్లు అయ్యాక రాజకీయం ఊబిలో కూరుకుపోయి స్వాహారాజ్యాన్ని తయారుచేసిన నేపథ్యంలో మనం సురాజ్యం తేవాలంటే రాజకీయ, ఎన్నికల సంస్కరణలు కూడా తప్పనిసరి. లేకుంటే ఆశించిన ఫలితాలు రావు. కాబట్టి వీటి కోసం కూడా మనం ప్రయత్నించాలి. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే, తక్కువ వస్తే ఓడినట్టే అనే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్ల అవినీతి ధనం ప్రభావం రాజకీయాలలో విపరీతమైపోతోంది. ప్రజలు స్వతహాగా నిజాయతీపరులే అయినా ప్రలోభాలను అధిగమించలేకపోతున్నారన్నది వాస్తవం. ఇక కొంతమంది తమకు నచ్చని రాక్షసరాజకీయాన్ని ఓడించటానికి ఇద్దరిలో కాస్త తక్కువ రాక్షసత్వం ఉన్న పార్టీని ఎన్నుకుంటున్నారు. మరికొందరు రాజకీయాల్ని తిడుతూ ఓటు వేయటం మానేస్తున్నారు. అలాగే ఎన్నికల సమయంలో తమ పేరు మీడియాలో రావటానికి ఒకొక్కరికీ రూ.కోటి ఖర్చవుతోందని కొందరు స్వయంగా చెప్పటం విన్నా. ఈ పరిస్థితులన్నిటినీ బేరీజు వేశాక ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను మార్చి దామాషా ఎన్నికల పద్ధతిని తేవటమే పరిష్కారం. దామాషా పద్ధతిలో వివిధ రకాలున్నాయి. వాటిలో ఏది మెరుగైనదో చర్చించుకోవచ్చు. అందరికీ గొంతు రావటం, నిజాయతీపరులు రాజకీయాలలో రావటం దామాషా ఎన్నికల వ్యవస్థలోనే సాధ్యమవుతుంది.

ఈ నాలుగు అంశాలతోపాటు బహిరంగచర్చ ప్రమాణాలను పెంచేందుకు కూడా అందరూ తమవంతు ప్రయత్నం చేయాలి. పరస్పర భావాలను గౌరవించుకునే సంస్కృతి లేకుండా సురాజ్యం సాధ్యంకాదు".... అని స్వరాజ్య ఉద్యమ తొలిదశ ఎజెండాను జేపీ సమావేశం ముందుంచారు. ఈ వ్యవస్థల ఏర్పాటు వల్లే సమస్యలన్నీ పరిష్కారం కాకపోయినా, అగమ్యత, నిరాశ నుంచి బైటపడి సమస్యల్ని పరిష్కరించుకునేందుకు దేశప్రజలకు ఒక మార్గం ఏర్పడుతుందన్నారు.



ఈ సమావేశంలో ఎఫ్‌డీఆర్ రీసెర్చి అండ్ అడ్వకసీ గ్రూప్‌నకు చెందిన కార్తీక్ చంద్ర పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన అనంతరం వక్తలు తమ అభిప్రాయాలను తెలియచేశారు.

**కె. నారాయణ (సీపీఐ)**

అధికారాన్ని వికేంద్రీకరించి బ్యూరోక్రసీని, రాజకీయ అవినీతిని కట్టడి చేస్తేనే స్థానిక సాధికారత సాధ్యమవుతుంది. ఎన్నికైన జెడ్‌పీలపై ఇంఛార్జి మంత్రులు పెత్తనం చెలాయిస్తున్నారు. జెడ్‌పీల ప్రాథమ్యాలను, కేటాయింపులను తమకు నచ్చినట్టు మార్చేస్తున్నారు. అధికారాల్ని స్థానిక సంస్థలకు బదిలీ చేస్తే ఇక మమ్మల్నెవడు పట్టించుకుంటాడు అని సాక్షాత్తూ ఒక ముఖ్యమంత్రి అన్నారు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాల గురించి జేపీగారు ఎప్పట్నుంచో కృషిచేస్తున్నారు. ఆయనలా అంటున్నకొద్దీ తమ అధికారాల్ని లాగేసుకుంటున్నట్టుగా ప్రభుత్వాలు భయపడుతున్నాయి. సురాజ్య ఉద్యమానికి సీపీఐ తరుపున అభినందనలు.

**డా॥ కె. లక్ష్మణ్ (బీజేపీ)**

స్థానిక సంస్థల ఎన్నికలు ఖచ్చితంగా సకాలంలో జరిగేలా చట్టబద్ధ ఏర్పాట్లు చేయాలి. జిల్లా కౌన్సిళ్లు ఉండాలి. ఎంఎల్‌సీ ఎన్నికలలో ఓటర్లు మూడింట రెండొంతులు స్థానిక ప్రభుత్వాల నుంచి వచ్చేలా చూడాలి. అవినీతి రాజకీయాల్ని మార్చటానికి దామాషా ఎన్నికల పద్ధతి రావాలి. ప్రతి పౌరుడూ ఖచ్చితంగా ఓటు వేసేందుకు చట్టబద్ధ చర్యలు తీసుకోవాలి. సురాజ్య ఉద్యమంలో బీజేపీకి కూడా భాగస్వామ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు.

**చెన్నమనేని రాజేశ్వరరావు (తెలుగుదేశం)**

ఎన్నికల వ్యవస్థలో, పార్టీల పనితీరులో తప్పనిసరిగా మార్పురావాలి. సురాజ్య ఉద్యమాన్ని ఊరూరుకూ తీసుకెళ్లండి. మీ ప్రయత్నంలో చిత్తశుద్ధి నాకు స్పష్టంగా కనిపిస్తోంది. లోక్‌సత్తా పార్టీవారిని, ఈ వేదికను నేను సంపూర్ణంగా అభినందిస్తున్నాను. తప్పకుండా భవిష్యత్తు మనది. ఎంత శక్తి ఉంటే అంత భాగస్వామి కావటానికి కృషి చేస్తాను.

**కె. వీరయ్య (సీపీఎం)**

స్వతంత్రం వచ్చి ఇన్నేళ్లయ్యాక ఈ అంశాల గురించి మాట్లాడుకోవాల్సి రావటం బాధాకరం. ఇందుకు ప్రభుత్వాల విధానాలే కారణం. ఆర్థికశాస్త్రంలో ట్రికిల్ డౌన్ థియరీ విఫలమైనా అవినీతి విషయంలో మాత్రం విజయవంతమైంది. పైస్థాయి వారు తాము అవినీతికి పాల్పడటం కోసం కిందిస్థాయిలో వారిని కూడా అవినీతిపరులుగా చేస్తున్నారు. దామాషా ఎన్నికల పద్ధతికి వామపక్షాలు పూర్తిగా కట్టుబడివున్నాయి. అధికార వికేంద్రీకరణ జరగాలంటే స్థానిక సంస్థలకి నిధులు, విధులు ఇవ్వాలి. సురాజ్య ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలి.

**కె. తారకరామారావు (టీఆర్‌ఎస్)**

ఇవాళ మనదేశంలో ఏ మనిషిని కదిలించినా వ్యవస్థ పట్ల, మార్పు వచ్చే అవకాశాల పట్ల ఎంతో నిరాశతో ఉన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతి చిన్న అంశాన్నీ ప్రభావితం చేసే రాజకీయాన్ని ద్వేషించటం, చిన్నచూపు చూడటం వల్ల నష్టం తప్ప లాభం ఉండదు. అందుకే జేపీగారి మార్గంలోనే అన్నా హజారే బృందం కూడా ఉద్యమం నుంచి పార్టీగా మారటానికి నిర్ణయించింది. మార్పు తేవాలంటే రాజకీయం తప్ప ప్రత్యామ్నాయం లేదు.

తెలంగాణ ఉద్యమానికి మూడు అంకాలు, పార్శ్వాలు ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్‌గారు ఎప్పుడూ చెప్పేవారు. ఒకటి) ప్రజల్ని చైతన్యపరచటం రెండు) ఆందోళనాపథం 3) ప్రజాస్వామ్యపద్ధతిలో సమన్వయపరచుకోవటం. ఈ మూడు పార్శ్వాలూ తెలంగాణ ఉద్యమానికే కాదు సురాజ్య ఉద్యమానికి కూడా అవసరమని నేను నమ్ముతున్నాను. స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను తమ ఇష్టానుసారంగా కాకుండా విధిగా ఇవ్వటానికి తగిన రాజ్యాంగసవరణ జరగాలనే ప్రతిపాదనకు కూడా పూర్తిమద్దతునిస్తున్నాను. ప్రజల దృక్పథంలో కూడా మార్పు రావాలి. ఉన్న ప్రభుత్వాలతో సర్దుకుపోవటం కాకుండా అత్యుత్తమ పాలననిచ్చే ప్రభుత్వాలను ఎన్నుకునే పరిస్థితి రావాలి. తమ పన్నుల డబ్బునే ప్రభుత్వం ఖర్చు చేస్తుంది అనే స్పృహ ఉంటే, అవినీతి జరిగినప్పుడు ప్రజలు తీవ్రంగా స్పందిస్తారు. ఎవరో అవినీతికి పాల్పడితే పోయేది తమ డబ్బే అనే భావన ఉంటే ఆ స్పందన వేరుగా ఉంటుంది.

అవినీతి+ సంక్షేమం= అధికారం అనే ఫార్ములా ఈరోజు అద్భుతంగా పనిచేయవచ్చుగానీ దీర్ఘకాలంలో అది ఖచ్చితంగా ప్రజలలో తిరుగుబాటుకు దారితీస్తుంది. ఎంత పెద్దపదవికి కూడా మినహాయింపు లేకుండా బలమైన లోక్‌పాల్, లోకాయుక్తలు రావాలి. అధికార

వికేంద్రీకరణ ప్రతిపాదనకు కూడా మా పూర్తిమద్దతు తెలుపుతున్నాం. గతంలో ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మండల వ్యవస్థ ఏర్పాటు చేసినప్పుడు చాలామంది గేలిచేశారు, విమర్శించారు. కానీ తర్వాతికాలంలో అదే పెద్దవిజయమైంది. జేపీగారు చెప్పినట్టు ఒక రాష్ట్రం ఏర్పాటు సర్వరోగనివారణ కాకపోవచ్చుకానీ, చిన్నరాష్ట్రాల ఏర్పాటు వల్ల పాలనాసౌలభ్యం ఉంటుంది. జనాభా పెరుగుతోందికాబట్టి ఇవాళ కాకపోయినా రేపైనా భారతదేశంలో చిన్నరాష్ట్రాలను ఏర్పాటుచేయాల్సి వస్తుంది. మిగిలిన అంశాలను పక్కనపెట్టి పాలనాసౌలభ్యం కోసం తెలంగాణ ఏర్పాటు అవసరమని గుర్తించాలని కోరుతున్నాను. అలాగే సుపరిపాలనకు ఎన్నికల, రాజకీయ సంస్కరణలు అవసరమనే వాదనతో పూర్తిగా ఏకీభవిస్తున్నాం. సురాజ్య ఉద్యమానికి అభినందనలు.

**జూపూడి ప్రభాకరరావు, ఎంఎల్‌సీ (వైకాపా)**

ప్రకాశం జిల్లాలో ఇటీవల జరిగిన ఉపఎన్నికలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అమ్ముకున్నందుకు సిబ్బందిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. రోజు కూలీ ఓటుకు డబ్బులడిగితే ఆశ్చర్యపోనక్కర్లేదు కానీ, చదువుకున్నవారు, విద్యాబోధన చేసేవారు కూడా ఓటుకు డబ్బులడిగే పరిస్థితి దాపురించింది. గ్రామస్థాయి నుంచి మన రాజ్యాంగవిధానాన్ని అమలుచేయటంలో ఎక్కడో దెబ్బతిన్నాం. ఒక సోషల్ ఇంజినీర్‌లా దాన్ని సరిచేసేందుకు జేపీ ప్రయత్నిస్తున్నారు. రేపటి సమాజానికి మనం ఎలాంటి సందేశం ఇస్తున్నామన్నది చాలా కీలకం. అందుకు సురాజ్య ఉద్యమం చేపట్టటం అభినందనీయం. అందులో నన్ను భాగస్వామిని చేసినందుకు ధన్యవాదాలు.

**పి.ఎస్ రామ్మోహనరావు, తమిళనాడు మాజీ గవర్నర్**

కేవలం కేంద్రానికి, రాష్ట్రాలకు మాత్రమే రాజ్యాంగంలో ప్రాధాన్యత ఉంది. స్థానిక ప్రభుత్వాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చేలా రాజ్యాంగంలో మార్పులు రావాలి. దానికి మనం ప్రయత్నం చేయాలి.

**టంకశాల అశోక్ (ది హాన్స్ ఇండియా పత్రిక)**

మార్పు కోసం పోరాటాలు బహుముఖంగా ఉండాలి. ఇందులో భాగంగా చట్రాల ఏర్పాటు, బహురూపాల ఉద్యమాలు కూడా జరగాలి. సురాజ్యం కోసం రౌండ్‌టేబుల్‌లా భిన్నకోణాలలో ఉద్యమాలు జరగాలని కోరుకుంటున్నాను.

**ప్రొఫెసర్ కె. సి సూరి (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ)**

రాజకీయాలను మనకు బైటి అంశాలుగా చూడకుండా మనలోని అంశాలుగా గుర్తించాలి. విమర్శలు ప్రామాణికంగా ఉండాలి. స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు కోరే సమయంలో మనం స్థానికంగా ఎలాంటి చొరవ చూపుతూ ఎలా వ్యవహరిస్తున్నాం, ఎలా మన రోజువారీ కలాపాల్ని మలచుకోగలుగుతున్నాం సమీక్షించుకోవాలి.

**జస్టిస్ లక్ష్మణరావు**

గ్రామప్రాంతం నుంచి ప్రజాపాలన మొదలై బలపడినప్పుడే ప్రజాస్వామ్యం శోభిస్తుంది. చట్టాలతోపాటు ప్రజాచైతన్యం మీద కూడా దృష్టి పెట్టాలి. ఏదోక మార్పు కాలంతో పాటు వస్తోంది. కానీ ఆశించిన మార్పు రావటంలా. ఆశించిన మార్పును సాధించటం కోసమే ఈ ప్రయత్నమంతా.

**కాకి మాధవరావు (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ)**

రాజకీయాలు, ప్రభుత్వోద్యోగులు, న్యాయవ్యవస్థ, మీడియా, పౌరసమాజం సమిష్టిగా కదిలితేనే మార్పులు వస్తాయి. కీలకమైన ఆ వ్యవస్థలలోని లోపాలు ఇప్పుడు మన సమస్యలకు మూలకారణమవుతున్నాయి. వాటిని సరిచేసుకోవటానికి సురాజ్య ఉద్యమంలో ప్రతిపాదించిన లక్ష్యాలు ఎంతో ఉపకరిస్తాయి.

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఇంకా...టి.ఎల్ నరసింహారావు (లోక్‌సత్తా ఉద్యమసంస్థ), జస్టిస్ రెడ్డప్ప రెడ్డి, శ్రీమతి సత్యవాణి (భారతీయం), హనుమాన్ చౌదరి, జానకిరామ్, రామకృష్ణం రాజు, పద్మనాభరెడ్డి (ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్), డి.వి.వి.ఎస్ వర్మ (లోక్‌సత్తా పార్టీ), ప్రొఫెసర్ రమేష్ బాబు, సోమసుందర్, శ్రీమతి రామలక్ష్మి (లోక్‌సత్తా పార్టీ, కర్ణాటక), సి. నరసింహారావు (రచయిత, విశ్లేషకులు), సోలిపేట రామచంద్రారెడ్డి (మాజీ ఎంపీ), వి.బి.జె చెలికాని రావు (ఐఎఫ్‌హెచ్.డి, హైదరాబాద్), తదితర పురప్రముఖులు పాల్గొన్నారు. ■

# సురాజ్య ఉద్యమానికి రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ

## ప్రతి పట్టణానికీ సురాజ్య ఉద్యమం

సురాజ్య ఉద్యమాన్ని పార్టీల కతీతంగా ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. ఇందుకోసం వివిధ రాజకీయ పార్టీల నేతలు, పౌరసమాజ సంస్థల ప్రతినిధులు ఆగస్టు 23న ఫ్యాప్సీహాల్‌లో సమావేశమయ్యారు.



లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ మీడియాకు వివరిస్తూ... అందరికీ స్థూలంగా ఏకాభిప్రాయం వున్న కొన్ని మౌలికాంశాలను వ్యవస్థీకృతంగా సాధించి, ప్రజలలో వ్యాపించివున్న నిరాశనిస్పృహల్ని పారదోలి విశ్వాసాన్ని పాదుకొలపటమే ఈ సురాజ్య ఉద్యమ మౌలికలక్ష్యమని తెలిపారు.

పౌరసేవల్ని ఒక హక్కుగా అందించేలా, అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి ఇచ్చేలా, అవినీతిరహిత పాలనను అందించేలా, ఎన్నికల సంస్కరణల ద్వారా నైతిక రాజకీయాలను అందించేలా ప్రభుత్వం మీద, రాజకీయ పార్టీల మీద ఒత్తిడిని పెంచేలా ప్రజలలో చైతన్యాన్ని, అవగాహనను పెంచటం సురాజ్య ఉద్యమ తొలిదశ లక్ష్యమని జేపీ చెప్పారు.

ప్రతి పట్టణంలో రౌండ్‌టేబుల్ సమావేశాలను ఏర్పాటుచేయటం, కళాశాలలో చర్చావేదికల్ని ఏర్పాటు చేయటం, వలంటీర్లకు శిక్షణనివ్వటం, సాహిత్యాన్ని ప్రచురించి అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం, డిసెంబర్ 9లోగా కనీసం కోటిమందిని చేరటం సురాజ్య ఉద్యమ తక్షణ లక్ష్యంగా పెట్టుకున్నామని జేపీ పేర్కొన్నారు.

సురాజ్య ఉద్యమాన్ని అన్నివర్గాల ప్రజలలోకి తీసుకెళ్లేందుకు సురాజ్య ఉద్యమ రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

### సురాజ్య ఉద్యమ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ

డా॥ జయప్రకాష్ నారాయణ్ (కన్వీనర్), చెన్నమనేని రాజేశ్వరరావు (మాజీ ఎమ్మెల్యే), ఎం.కోదండరెడ్డి (మాజీ ఎమ్మెల్యే), సోలిపేట రామచంద్రారెడ్డి (మాజీ ఎంపి), చుక్కా రామయ్య (ఎం.ఎల్.సి), ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ (ఎం.ఎల్.సి), కె. పద్మనాభయ్య (విశ్రాంత (ఐఎఎస్), కాకి మాధవరావు(విశ్రాంత ఐఎఎస్), ఎం.పద్మనాభరెడ్డి (విశ్రాంత ఐఎఫ్ఎస్), ఎస్.ఎస్ రాజమౌళి (సినీ దర్శకులు), తమ్మారెడ్డి భరద్వాజ (సినీ నిర్మాత), కె. శ్రీనివాసరెడ్డి (ఐ.జె.యు), డి. సోమసుందర్ (ఎ.పి.యు.డబ్ల్యు.జె), చెలికాని రావు (రెసిడెన్షియల్ అసోసియేషన్స్), రామకృష్ణం రాజు (ఎన్.ఎ.పి.ఎం), టి.ఎల్. నరసింహారావు (లోక్‌సత్తా), శ్రీమతి సత్యవాణి (భారతీయం), మజీద్ హుస్సేన్ (కోవా), వి. లక్ష్మణ్ రెడ్డి (జనచైతన్య వేదిక), శ్రీమతి జి. ప్రతిభారావు, డి.వి.వి.ఎస్ వర్మ, కార్తీక్ చంద్ర, పద్మ భూపతిరాజు, సలహాదారులలో కె. రామచంద్రమూర్తి (హెచ్ఎంటీవీ, ది హన్స్ ఇండియా), తెలకపల్లి రవి (రచయిత, సీనియర్ పాత్రికేయులు) ఉన్నారు.

★ వివిధ పార్టీల ప్రతినిధులతోనూ, ఆసక్తి గల ప్రముఖులతోనూ సంప్రదించి సురాజ్య ఉద్యమ కమిటీని అందరి భాగస్వామ్యం ఉండేలా మరింత విస్తృత పరుస్తామని జేపీ ప్రకటించారు

# సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ



*సురాజ్యం కోసం సాగిస్తున్న*
*మరో స్వతంత్ర పోరాటంలో*
*నేను భాగస్వామిగా ఉంటాను*
*స్వతంత్ర సమరయోధుల త్యాగఫలాన్ని*
*రాజ్యాంగ విలువలని రక్షించుకోవడం కోసం,*
*అవినీతిని అంతం చేయడం కోసం*
*నా సర్వశక్తుల్ని ఒడ్డుతాను*
*కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా*
*దేశ ఐక్యతని, సమగ్రతని నిరంతరం కాపాడుతాను*
*దేశ నిర్మాణ కార్యక్రమంలో నేను విధిగా పాల్గొంటాను*
*ప్రజాస్వామ్యంలో సురాజ్యం నా జన్మహక్కు*
*దానిని సాధించడం నా విధిగా భావించి*
*ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను*

# సురాజ్య ఉద్యమం కొన్ని నినాదాలు

కొందరి స్వార్థం కోసం స్వాహారాజ్యం - అందరి బాగుకోసం సురాజ్యం

రాయితీల బతుకుల కన్నా - ఎదిగే అవకాశాలే మిన్న

స్వాహారాజ్యం కూలుద్దాం - సురాజ్యం నిర్మిద్దాం

ప్రభుత్వ సేవలలో లంచాలు పోవాలి - హక్కుగా ప్రజలకు సేవలందాలి

కొత్త లోకాయుక్త రావాలి - అవినీతి భరతం పట్టాలి

చెడ్డ రాజకీయాన్ని తుంచు - మంచి రాజకీయాన్ని పెంచు

నీతిపరులకి అధికారం - అవినీతిపరులకి కారాగారం

నిజాయితీకి పట్టం కడదాం - అవినీతికి గోరీ కడదాం

ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం - దామాషా పద్ధతితోనే సాధ్యం

# లోక్‌సత్తా సురాజ్య ఉద్యమం

## అక్టోబర్ 2 వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలు

సురాజ్య ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా విశాల ప్రాతిపదికన నిర్వహింపజెయ్యాలి. ఈ ఉద్యమం ద్వారా ప్రముఖుల్ని, మేధావుల్ని, మధ్యతరగతి వర్గాలతోపాటు, విద్యార్థుల్ని, యువతనీ, స్వచ్ఛంద సంస్థలనీ, గ్రామీణ ప్రజల్ని, రైతుల్ని గట్టి ప్రయత్నం జరగాలి.

**1. రౌండ్‌టేబుల్ సమావేశాలు :** ప్రతి పట్టణంలో ముందుగా ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని, – పురప్రముఖులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించాలి. సురాజ్య ఉద్యమ లక్ష్యాలను పరిచయం చేసి అందరితో మాట్లాడించాలి.

ఈ సమావేశంలోనే ఒక తాత్కాలిక సన్నాహక సంఘాన్ని ఏర్పాటు చెయించాలి. ప్రతి విద్యా సంస్థ తన ఆధ్వర్యంలో విద్యార్థులకు చర్చాగోష్టులను, ప్రతి స్వచ్ఛంద సంస్థ తన సభ్యుల సమావేశంలో ఒక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయింప జెయ్యాలి.

**2. వివిధ సంస్థలలో చర్చాగోష్ఠులు :** ఆగస్టు–సెప్టెంబరు నెలలో విద్యాసంస్థలలో, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కనీసం 10 చర్చా కార్యక్రమాలు నిర్వహింప జెయ్యాలి. వీటితో పాటు కళాశాలల లెక్చరర్లతో హైస్కూలు– ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో డాక్టర్లు, లాయర్లతో ప్రత్యేక రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహింప జెయ్యాలి.

**3. వలంటీర్ల నమోదు :** ఈ చర్చా కార్యక్రమాలన్నింటిలోను వలంటీర్ల నమోదు విధిగా జరిపించాలి. విద్యార్థులలో హెచ్చు సంఖ్యలో వలంటీర్ల నమోదుకు వీలుగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలి. మొత్తం మీద పట్టణంలో కనీసం 100 మంది వలంటీర్లను నమోదు చేయించాలి.

**4. వలంటీర్లకు శిక్షణ :** నమోదు చేసుకున్న వలంటీర్లకు విధిగా ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలి.

**5. ప్రజా ఛార్జిషీట్లు :** స్థానికంగా ఆఫీసుల్లోను వివిధ పథకాలలో వున్న అవినీతిని వెలికితీసి, తగిన ఆధారాలు సేకరించి ఒక ప్రజా ఛార్జిషీటును రూపొందించడానికి తగిన బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. ఈ ప్రజాఛార్జిషీటును, సంబంధిత అధికారులకు ఇవ్వాలి. పత్రికలకు విడుదల చెయ్యాలి. అవినీతికి గురైన బాధితులతో మాట్లాడించాలి. బాధితులు సామూహికంగా ముందుకు వచ్చే చోట తగిన ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలి. పట్టణంలో కనీసం 4 ఛార్జిషీట్లు ప్రకటింపజెయ్యాలి. ఆఫీసులలో అవినీతి, పథకాలలో అవినీతి మీద ప్రజా బ్యాలట్‌లు నిర్వహించి, ఫలితాలు ప్రకటింపజెయ్యాలి.

అవినీతికి సంబంధం లేకుండా కేవలం ప్రజాసమస్యలకు సంబంధించిన అంశాలయితే వాటిని వినతిపత్రాల రూపంలో అధికారులకు అందజేసి ఫలితాలు రాబట్టడానికి ప్రయత్నించాలి.

**6) సురాజ్య ఉద్యమ కమిటీ :** ఈ కార్యకలాపాలలో కలిసి వచ్చిన అన్ని విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, పురప్రముఖులతో విస్తృత స్థాయిలో సురాజ్యఉద్యమ కమిటీని ఏర్పాటు చెయ్యాలి. రోజువారీ కార్యక్రమాల నిర్వహణకు ఒక సారథ్య సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలి. ఈ కమిటీకి సారథులుగా పురప్రముఖుల్ని, లోక్‌సత్తా ఉద్యమసంస్థ ప్రతినిధుల్ని ముందుంచాలి.

**7) అక్టోబర్ 2 గాంధీ జయంతి కార్యక్రమాలు**

అన్ని విద్యాసంస్థలలో సామూహికంగా జాతీయ గీతాలాపన, ప్రతిజ్ఞ, కార్యక్రమాలు నిర్వహించాలి. అక్టోబర్ 2 శెలవు అయితే అక్టోబరు 1వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించాలి.

అక్టోబర్ 2న పట్టణంలో వందలాది మందితో సామూహిక సత్యాగ్రహ కార్యక్రమం సాగించాలి. (నిరాహార దీక్ష కాదు) ఉదయం 11 నుండి సా॥ 4 గంటల వరకు దీనిని సాగించాలి. అందరితోనూ మాట్లాడించాలి.

**8) సురాజ్య ఉద్యమనిధి**

సురాజ్య ఉద్యమనిధి సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలి. స్థానికంగా చేపట్టే కార్యకలాపాలకు ఈ నిధులను వినియోగించుకోవాలి. జమాఖర్చులు పారదర్శకంగా వుండేలా ఒక బాధ్యుణ్ణి నియమించుకోవాలి. దీనిపై లోక్‌సత్తా తెలియజేసే మార్గదర్శకాలను పాటించాలి.

ఇవీ అక్టోబర్ 2 వరకూ సాగించాల్సిన సురాజ్యఉద్యమ కార్యక్రమాలు. ■

# సుపరిపాలన పౌర హక్కు
# సురాజ్యం మన జన్మ హక్కు

## కొత్త వ్యవస్థలతో సరికొత్త జీవనం


## సురాజ్యం : అందరికీ ఎదిగే అవకాశాల కోసం



- డబ్బుతో నిమిత్తం లేకుండా పిల్లలందరికీ మంచి ప్రమాణాల చదువు
- జేబు నుండి పైసా ఖర్చు లేకుండా అందరికీ వైద్యసేవలు
- యువతకు ఉపాధినిచ్చే నైపుణ్యాలు
- రైతులకు లాభసాటి వ్యవసాయం
- మహిళలకు ప్రత్యేక ఆదాయ మార్గాలు

**రాయితీల బతుకు కన్న - ఎదిగే అవకాశాలే మిన్న**

## సురాజ్యం : మన ఊళ్ళో మంచి వసతుల కోసం




- శుద్ధి చేసిన మంచినీళ్ళు
- దోమలు లేని పారిశుధ్యం
- పక్కా రోడ్లు, వీధి దీపాలు
- అందరికీ స్వంత ఇల్లు
- 24 గంటలు గృహ విద్యుత్

**స్థానిక ప్రభుత్వాలుగా పంచాయితీలు, మున్సిపాలిటీలు**

**తలసరి రూ.1000/- వార్షిక గ్రాంటు**

## సురాజ్యం: లంచాలు లేని ప్రభుత్వ సేవల కోసం




- ప్రతి ప్రభుత్వ ఆఫీసులో సిటిజన్స్ ఛార్టర్లు
- అన్ని సేవలకు నిర్దిష్టమైన గడువు
- గడువులోగా అందనిసేవలకు పరిహారం
- జవాబుదారీతనం లేకపోతే జరిమానాలు

**పౌరసేవల హక్కు చట్టం**

## సురాజ్యం : అవినీతిరహిత పాలన కోసం




- అవినీతి భరతం పట్టే లోకాయుక్త
- ప్రతి జిల్లాకు ఒక అంబుడ్స్‌మన్

**కొత్త లోకాయుక్త చట్టం**

## సురాజ్యం : కొత్త తరహా ఎన్నికల వ్యవస్థ కోసం

ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం
డబ్బు ప్రభావం తగ్గించడం

**దామాషా పద్ధతి ఎన్నికలు**



## సురాజ్య ఉద్యమం

సారధులు మీరే....
సాధిద్దాం రండి

దిల్‌నాజ్ మాన్షన్, ఇ.నెం. 7-1-57/2/ఎ, ధరమ్ కరణ్ రోడ్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 016
ఫోన్ : 040 - 23733936, ఫాక్స్ : 23733935










**న్యూయార్క్‌లో ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పీపుల్ ఫర్ లోక్‌సత్తా న్యూజెర్సీ చాప్టర్ నిర్వహించింది. సురాజ్యం సాధించాలని నినాదాలు చేసి, సురాజ్యం కోసం ఉద్యమించాలని ప్రతిజ్ఞ చేశారు.**